# కలం తిరగబడింది

ఉక్కడాల రామమూర్తి

చీదరతో నిండినదనుకున్న ప్రాపంచిక జీవితంలో తన స్థానాన్ని ఊహించుకొని ఒక దీర్ఘమైన నిట్టూర్పువిడిచాడు కవి. కేవలం క్షుద్బాధానివారణకై తను ఒక యంత్రంలాగు పని చేస్తూ తనలో దాగివున్న కవనసంపదను మనస్ఫూర్తిగా సేవచేయలేక పోతున్నానే, అని చింతించాడు.

చిరకాలంగా సంస్కరణ లేక మూలపడివున్న తన అసంపూర్ణ ప్రణయ ప్రబంధాన్ని బూజు దులిపి చేతబట్టాడు. పుటలు తిరగవేస్తూ, తన సులక్షణ కవితా ధోరణికి తనే ముగ్ధుడైపోయాడు. 'అవును. తనేమిటి, ఆస్వాదించిన ప్రతి వ్యక్తీ ముగ్ధుడై పోవలసిందే' అని పలికింది కవి హృదయం మారు మూలలనుండి.

కలం చేతబట్టి ముందుకు సాగిపోతున్నాడు కవి. 'సెల యేటి మర్మరధ్వనులు మెల్లిగా మీటిన వీణాతంత్రులను అధిగమించుచుండ, ప్రియురాలి తొడపై తలపెట్టుకొని శరచ్చంద్రుని చంద్రికాశోభనధిక్కరిస్తున్న ప్రేయసిముఖారవిందాన్ని, ఆమె అరమోడ్పు కన్నులలోని ప్రశాంతతను కథానాయకుడు వీక్షిస్తున్న' ఘట్టంలో, కవి చేతిలోని లేఖిని చిందులు త్రొక్కి నిలిచిపోయింది. ఎందుకో రచనావేగం మందగించింది.

* * *

కవి ఆ దృశ్యమే మరలమరల మననం చేసికొంటూ వాలుకుర్చీలో వాలిపోయాడు. నిశ్శబ్దం.

ఇలా ఎంతకాలం గడచిపోయిందో తెలియలేదు. అంతా శూన్యంగా కన్పిస్తోంది. తనెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెలీక తికమకపడ్డాడు కవి.

దూరంలో ఏదో కదలి నట్లయింది. ఏమిటా అది అని వితర్కించుకొనే లోపల ఒకవ్యక్తి తన సమీపంలో నించొని ఉంది.

ప్రశాంతమైన కవి మనస్సముద్రంలో తుపాను చెలరేగింది. తన ఎదుటనున్నది స్త్రీయా, లేక పురుషుడా అని నిర్ణయించుకో లేకపోతున్నాడు.

వ్యక్తిస్వరూపం, మొదట్లో అసహ్యం కలిగించినా, కొంతకాలానికి ఎందుకో అర్థంలేని, అప్రయత్నమైన జాలి కలిగించింది.

కొంచెం సేపటికి భయంకూడాకలిగింది. ఎందుకు కలిగిందా అని ఆలోచించాడు కాని-చెప్పుకోదగినంత కారణం కన్పించలేదు.

'ఏమిటి - ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు? నాతో నీకేంపని?' అన్న ప్రశ్నలు, చక్రంలా తిరుగుతూ బుర్రలో పుట్టుకొస్తున్నాయి కాని, నించున్న వ్యక్తిని నిలదీసి అడగలేక పోతున్నాడు.

ఈ సంఘటనను, త్రిశంకు స్వర్గంలో వూగులాడుతున్న తన మనోభావాలను, మరొక్కమారు సింహావలోకనం చేసికొంటే ఇదంతా తనలో ఏదో విప్లవాత్మకమైన మార్పుకు నాంది అని అనిపించింది కవికి.

'ఏం, కవీ?' అని పిలిచింది వ్యక్తి.

ఉలిక్కిపడ్డాడు కవి. 'అయితే, ఈ అపరిచిత వ్యక్తికి తనెవరో బాగా తెలుసునన్న మాట' అని మనస్సులో తట్టేటప్పటికి మరింత భయమేసింది.

ఒక వెకిలినవ్వు, వ్యక్తి నోరుదాటి బయట పడింది. ఆ నవ్వు, కంటికి మాత్రం నవ్వుగానే ఉంది కాని, శబ్దధోరణి ఏదో గరగర లాడినట్లుంది!

'కవీ ! నన్ను చూస్తే భయంకలుగుతోందా నీకు? అవును--అంతేలే--నిన్నని ప్రయోజనంలేదు ...' అంది వ్యక్తి.

'నీవు మాట్లాడేది నాకు అర్థమవడంలేదు' అని అనగలిగాడు కవి.

'దేనికి అర్థమవుతుంది ! అసలు అర్థంచేసికొనే పరిస్థితిలో వున్నావా నువ్వు. ఒక్కమారిలా నన్ను చూడు...చూడమంటే, నా అందం చూడమని కాదు. అందమని ఎందుకంటున్నానో తెలుసా ? ఊహాపథాల్లో నువ్వు నిర్మించుకొనే, నువ్వు వూహించుకొనే లేతలావణ్యము తొణికిసలాడే యౌవనపు మిసమిసలు నాలో నీకు కన్పించవు కనుక....అసహ్యించుకోకుండా, సావకాశంగా చూడు...ఏం ? ఏంకన్పిస్తున్నాయి ?... చాలమంది శరీరాల్లో నొక్కుకున్నా కన్పించని

ఏమీ కలేనా ? ' జడివానజల్లులా సాగిపోతున్నాయి మాటలు.

కవినోటిలో తడి ఆరిపోయింది.

ఇంతలో మరోమూలనుండి 'ఓ కవీ !' అన్న పిలుపు. అబ్బ ! సముద్రపుటొడ్డున చల్లగాలి సోకి నట్లయింది కవికి.

ఇటు తిరిగిచూస్తే మరోవ్యక్తి. ఎందుకో, ఒక విధమైన చల్లదనం ఆత్మీయత కన్పించాయి, నూతనవ్యక్తిలో. ఇద్దరిని పోల్చిచూచాడు. భౌతికంగా ఏం భేదం కన్పించలేదు.

ఆరాటపడుతున్న హృదయానికి శాంతి లభించి నట్లయింది కవికి.

'కవీ !' అని అంటుండగానే, చిఱునవ్వు రేగి, మెఱుపుతీగలా దర్శనమిచ్చింది నూతనవ్యక్తిలో. 'పాపం ! వెఱ్ఱివాడవు. దానిమాటలకు అంత భయపడిపోవాలా ? ఆవ్యక్తిని చూడడం, ఇదేకాబోలు మొదటిసారి. అందుకే సుడిగాలిలో లేతాకులాగ వణకిపోతున్నావు.'

'ఇదిగో యిలాచూడు ' అంది మొదటి వ్యక్తి. 'మళ్లీ మోసగింపబడుతున్నావు. యిలాగే నీ జీవితమంతా మోసగింపబడ్డావు '—

'అబ్బ ! దాని మాటలు వినకోయి కవీ ! వట్టి వెకిలి వాగుడు—అది సరే. రేపేకదూ పూర్ణచంద్రుని సందర్శనం. అందులో యిది శరత్కాలంకూడా. ఆహా ! కవీ ! ఒక వూహతోనే నీఒళ్లు పులకరించి పోవడంలేదూ ! ఒక్కమారు నీ కవితా హృదయాన్ని మీటి సుమధురంగా ఒక్కగీతం ! ఒక్క విరహగీతం ఆలాపించవూ ! నీవంటి వారుండికూడా, అటువంటి శుభసమయాలునిరర్థకమవుతాయంటే, పాలరాతిలో ప్రతిఫలించే, ఆ శశాంకుని కాంతికిరణాలు, రక్తవిహీనుని ముఖకాంతులు మాత్రమే సుమా ! ఇదిగో ఒక్కమాట చెప్తున్నా విను. నువ్వు కవివి ! సర్వస్వతంత్రుడవని తెలిసికో. కవి మనోప్రవాహాలకు ఆనకట్టలు కట్టకలవారు, అనంతవిశ్వంలోలేరు. ఓయీ కవీ! తొందరపడి, దాని మాటలువిని భగ్నజీవివి కావద్దు సుమా ' అని జారిపోతున్న కవిని యథాస్థానంలో నిలుప ప్రయత్నించింది, నూతనవ్యక్తి.

'ఏమోయి కవీ !' ఉఱుమువంటి సంబోధన. ఏహ్యభావంతో మిళితమయిన కోప లక్షణాలు ప్రస్ఫుటమయినాయి మొదటివ్యక్తిలో. ఆచూపులు తన గుండెలను పెకలిస్తున్నా యనిపించింది కవికి.

ఏ అశనిపాతాలు వూడిపడ్తాయో అని ఎదురు చూస్తున్నాడు. 'ఏం! లొంగిపోయావా? ఆ తేనె పూసిన మాటలకు తల వంచావా? అంతే! నీ జీవితమంతా అంతే. హు: !...స్వతంత్రుడట ! స్వతంత్రుడు! ఎవరికి కావాలోయి నీ విరహగీతాలు; నీ ప్రియురాలి ప్రణయసల్లాపాలు; నీ తుమ్మెదల ఝుంకారాలు! నన్ను, నా అవతారాన్ని యిదివరకే చూశావుకదూ!—దేశంలోని ముప్పాతిక ప్రజ అవతారంకూడా యింతేనని తెలిసికో కవీ! ఆశ్చర్యపడుతున్నావా? ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయం వీసమంతకూడా లేదు. దుర్భర దారిద్ర్యంలోపడి మ్రగ్గి జీవచ్ఛవాలైన వీరిలో ఎవరికావాలి నీ ప్రేమగీతాలు ! నీ పల్కుల్లోని మాధుర్యాన్ని నీతోపాటు గ్రహించకలవారు ఎందరున్నారు? నీ కవిత్వాన్ని ఎవరూ విమర్శించలేరు—కానీ అది అప్రస్తుతం, నిష్ప్రయోజనం, ప్రజల యింతనీచస్థితికి కారణ మూహించావా ?—అజ్ఞానము, నిరంతర భావదాస్య ఫలితమైన అజ్ఞానం. నీ సోదరమానవాభ్యున్నతికై, నీవు ఈ స్వప్నావస్థనుండి మేల్కొవాలి కవీ! ప్రజ కందుబాటుగా విజ్ఞాన ప్రబోధకమైన గీతాలు రచించాలి; జాతీయ వికాసాన్ని రేకెత్తించే గీతాలు జాతి జనులందరి నోటా వాడవాడలా గింగురులెత్తించేట్లు రచించాలి! అప్పుడే నీ జీవితం సార్థక మవుతుంది కవీ ! లే, నీజీవితంలో నూతనాధ్యాయం మొదలుపెట్టు.'

కవిమనస్సు తేలికయింది. 'ప్రయత్నిస్తాను' అన్నాడు.

నూతనవ్యక్తి, ఓటమి నెత్తిపై తాండవమాడుతుండగా, కాలసర్పంలా నిష్క్రమించింది.

విజయరేఖలు తొంగిచూస్తూంటే, 'శుభం' అని దీవించి, తరలిపోయింది మొదటి వ్యక్తి.

* * *

కళ్లు తెరిచేటప్పటికి ' ఏలోకంలో ఉన్నారు కవిగారు !' అని కిలకిలా నవ్వింది ఆయన సతీమణి.

'మనఃపరివర్తన పొంది, పీడితజనుల ప్రబోధానికై బాహ్యప్రపంచంలోకి వచ్చారు కవిగారు ' అన్నాడు సగర్వంగా.

అర్థంకాని చూపు చూసింది ఆ యిల్లాలు.